క్లుప్తంగా

చేపల సొసైటీ ప్రెసిడెంట్‌గా కృష్ణ



ఎంపికైన మండల చేపల సొసైటీ సభ్యులు

ఓడీ చెరువు: మండల చేపల సొసైటీ ప్రెసిడెంట్‌గా పరిగి కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సొసైటీ సభ్యుడు, సొసైటీ ఎన్నికల అధికారి మండోజీ ఆరీఫ్‌ఖాన్ ఆదివారం తెలిపారు. సెక్రటరీగా బాసాహెబ్‌పల్లి బాషా, వైస్ ప్రెసిడెంట్‌గా నరసయ్య, కమిటీ సభ్యులుగా రామచంద్ర, నరసింహులు, అబ్దుల్, అంజినప్ప, నాగేశ్వర తదితరులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అమడగూరు: మండలంలోని బిక్లూరు క్రాస్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో రమణప్ప అనే వ్యక్తి కర్ణాటక మద్యం తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ సందర్భంగా పోలీసులు అతడి నుంచి 80 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు పంపనున్నట్లు ఎస్‌ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు.

పెద్దమ్మ దేవాలయంలో పూజలు



పూజలందుకున్న పెద్దమ్మ దేవత

తాడిమర్రి: స్థానిక ఎస్సీ కాలనీలో ఉన్న పెద్దమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మ మూల విరాట్‌కు పూజారి దేవమ్మ వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలతో అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మ వారికి బోనాలు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

శుభకార్యం

కదిరి టౌన్: పట్టణంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిజాంవలీ కాలనీకి చెందిన జనాబ్ షేక్ ఖలీల్ కుమార్తె వివాహం జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి వివాహానికి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కాకతీయ విద్యానికేతన్ విద్యార్థుల సత్తా



పదో తరగతి విద్యార్థులతో కాకతీయ విద్యానికేతన్ పాఠశాల నిర్వాహకులు

ధర్మవరం అర్బన్: పదో తరగతి ఫలితాల్లో ధర్మవరంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. జిల్లా స్థాయిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన 11 పాఠశాలల్లో ధర్మవరం కాకతీయ విద్యానికేతన్ మొదటి స్థానంలో నిలిచిందని పాఠశాల ఫౌండర్ శెట్టిపి రామిరెడ్డి, కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి తెలిపారు. 48 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 48 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఆదివారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి: నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజల్లో ఉమ్మడి జిల్లావాసులేకాక, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి, మొక్కులు తీర్చుకున్నారు.

హాకీ పోటీల్లో ప్రతిభ



శ్రావణిని అభినందిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: ఈనెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ హాకీ పోటీల్లో జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని శ్రావణి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. ఆదివారం కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్, పీడీ ఆనంద్ తదితరులు విద్యార్థినిని అభినందించారు.

పోతలయ్య స్వామి ఆలయంలో పూజలు

కనగానపల్లి: దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్యస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కాపులు, భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు పోతలయ్యస్వామికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన ఏటి గంగమ్మ జాతర

తలుపుల: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఏటి గంగమ్మ ఆలయం వద్ద మొలకల పౌర్ణమి సందర్భంగా రెండ్రోజులుగా నిర్వహిస్తున్న జాతర ఆదివారం ముగిసింది. 5వ తేదీ శుక్రవారం ఏటి గంగమ్మ చెల్లెళ్లు అయిన చింతల గంగమ్మ, గాండ్లపెంట గంగమ్మలకు సారె చీర కార్యక్రమం, గంగమ్మతల్లి హరికథ, 6వ తేదీ రాత్రి బలిజపేట నుంచి చాందినీ బండి ఊరేగింపు, కాంబోజి రాజు హరికథా కాల క్షేపం, 7వ తేదీ ఉదయం టి.రెడ్డి వారిపల్లి, బలిజపేట, ఎగువపేట గ్రామాలకు చెందిన మహిళలు బోనాల గంపలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. జంతుబలి కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఎద్దుల బండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సాసవుల చెన్న కథ కాలక్షేపం, 5, 6వ తేదీల్లో రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేశిరెడ్డి శివారెడ్డి, లక్ష్మీ నారాయణమ్మల జ్ఞాపకార్థం వీరి కుమారుడు డి.రఘునాథరెడ్డి కుటుంబం మొలకలు పోసిన వారికి 30 చీరలను ఎస్‌ఐ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, చిన్నపరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఎద్దుల రాముడు, వెంకటరవణప్ప, శివారెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చింతమాను గంగమ్మ ఉత్సవాలు..

గాండ్లపెంట: మండల పరిధిలోని మల్లమీదపల్లి పంచాయతీ కోటూరు గ్రామంలో ఆదివారం రాత్రి చింతమాను గంగమ్మ ఉత్సవాలు నిర్వహించారు. కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీ.వీ.సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కళావతి ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలు ఉండాలని.. పంటలు బాగా పండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చలపతి, ప్రతాప్‌రెడ్డి, అమానుల్లా, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ గజ్జెల రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.



తలుపుల: ఎద్దుల బండిని ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



గాండ్లపెంట: చింతమాను గంగమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

వేడుకగా యల్లమ్మ తిరునాల



యల్లమ్మ దేవతకు జ్యోతులు సమర్పిస్తున్న భక్తులు

ఎన్‌పీకుంట: మండల కేంద్రంలో గత నాలుగు రోజులుగా అత్యంత వైభవంగా జరిగిన యల్లమ్మ తిరునాల ఆదివారం ముగిసింది. శనివారం రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. జాగరణ నిమిత్తం ఆర్కెస్ట్రా ఏర్పాటు చేసి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి భక్తిశ్రద్ధలతో జ్యోతులు, బోనాలు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శివారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మ తల్లికి పూజలు..

మండల కేంద్రంలోని నల్లగంగమ్మ ఆలయంలో మొలకల పౌర్ణమి సందర్భంగా గత మూడు రోజుల పాటు నిర్వహించిన జాతర ఆదివారం ముగిసింది. జాతరలో భాగంగా శనివారం రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారికి అంబళ్లు పోసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. చల్లగా చూడు గంగమ్మా అంటూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

నాలుగేళ్ల అభివృద్ధి కనిపించలేదా?

- ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సొంత డబ్బుతో అభివృద్ధి చేశారు
- పరిటాల కుటుంబం అక్రమార్జనతో రూ.కోట్లకు పడగలెత్తింది
- తీవ్ర స్థాయిలో మండిపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

ఆత్మకూరు: రాప్తాడు నియోజకవర్గంలో నాలుగేళ్లుగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి టీడీపీ నాయకులకు, పరిటాల కుటుంబానికి కనిపించడం లేదా అని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. ఆదివారం ఆత్మకూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీలు విజయ్‌కుమార్, నీలిమ, సర్పంచ్ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడారు. పరిటాల కుటుంబం పాతికేళ్లుగా కుట్రలు, కుతంత్రాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, హత్యా రాజకీయాలకు పాల్పడిందని, అవినీతి అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు కూడబెట్టిందని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, డ్వాక్రా, వ్యవసాయ, బంగారు రుణాల మాఫీ, నిరుద్యోగ భృతి తదితర అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ.. ఏ ఒక్కటీ నెరవేర్చకుండా నిలువునా మోసం చేసిందన్నారు. హామీలు నెరవేర్చకపోగా.. ప్రజల అవసరాలను, నియోజకవర్గ అభివృద్ధిని ఏనాడూ పరిటాల కుటుంబం పట్టించుకోలేదని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రజలకు సేవ చేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. ప్రభుత్వ నిధులే కాకుండా అవసరమైన చోట తన సొంత ఖర్చుతో సైతం అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల మన్ననలు పొందారన్నారు. జనరంజక పాలన సాగిస్తున్న జగనన్నను, ప్రజాసేవలో దూసుకుపోతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని చూసి టీడీపీ నేతలు – పరిటాల కుటుంబీకులు ఓర్వలేక దుష్ప్రచారానికి దిగుతున్నారన్నారు. మేనిఫెస్టోలోని అంశాలన్నింటినీ నెరవేర్చడమే కాకుండా గ్రామాల్లో సదుపాయాల కల్పన తదితర అభివృద్ధి పనులు చేపడుతున్న ఎమ్మెల్యేపై అవాకులు చెవాకులు పేలుతూ 'పచ్చ' మీడియాలో అసత్య కథనాలు రాయిస్తున్నారని పరిటాల కుటుంబంపై మండిపడ్డారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రూ.2వేల కోట్ల డిపాజిట్‌దారుల సొమ్మును చంద్రబాబు–రామోజీరావు స్వప్రయోజనాలకు వాడుకుని, పదేళ్ల తర్వాత డిపాజిట్‌దారులకు వడ్డీలు ఎగ్గొటి ముప్పుతిప్పలు పెట్టారని ఆరోపించారు.

రూ.వేల కోట్లు ఎలా వచ్చాయి?

రాజకీయాల్లోకి రాకముందు ఐదు ఎకరాల భూమి మాత్రమే ఉన్న పరిటాల కుటుంబానికి నేడు రూ.2 వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అక్రమ సంపాదన కోసం వెంపర్లాడకుండా ప్రజా ప్రయోజనాల కోసం పాకులాడారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రకాష్‌రెడ్డి రూ.6 కోట్లు వెచ్చించి రైతులకు ఉచితంగా బోర్లు వేయించారన్నారు. పేరూరు డ్యాంకు నీళ్లు తెప్పించడంతో పావగడ, కల్యాణదుర్గం, కంబదూరు, రొద్దం, రామగిరి, కనగానపల్లి, ఆత్మకూరు, రాప్తాడు చుట్టూ దాదాపు 60 కిలోమీటర్లు భూగర్భ జలాలు పెరిగాయన్నారు. 40 కిలో మీటర్ల మేర కాలువలు సైతం తీయించారన్నారు. నీటి పారకంతో ఇక్కడ భూమి ధరలు కూడా పెరిగాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి రూ.1,700 కోట్లు ఖర్చుపెట్టారన్నారు. 25 వేల జగనన్న ఇంటి నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ట్రస్ట్ ద్వారా కూడా రూ.కోట్లు వెచ్చిస్తున్నారన్నారు. దాదాపు రూ.15 కోట్లతో మహిళా సహకార డెయిరీని ఏర్పాటు చేశారన్నారు. మసీదులు, ఆలయాల అభివృద్ధికి సొంత డబ్బులు వెచ్చిస్తున్న ఎమ్మెల్యేను విమర్శించడం దారుణమన్నారు. పరిటాల సునీత ఎన్నికల్లో ఓడిపోవడంతో మతిభ్రమించి మాట్లాడటమే కాకుండా.. కార్యకర్తలతో ఇష్టారాజ్యంగా ఎమ్మెల్యేపై విమర్శలు చేయిస్తోందని ధ్వజమెత్తారు. ఎవరు ఏమి చేశారనేది ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, 2024 ఎన్నికల్లో సరైన తీర్పు ఇస్తారన్నారు. సమావేశంలో తోపుదుర్తి సర్పంచ్ ఓబులేష్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వాసుదేవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గోపాల్‌రెడ్డి, నాగరాజ్, ఈశ్వరరెడ్డి, వన్నూరప్ప, ఎర్రిస్వామి, రామాంజి పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు



పోస్టర్లు విడుదల చేస్తున్న గ్రంథాలయ అధికారిణి శకుంతలా బాయి

నల్లమాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి ఈనెల 11 వరకూ వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి బీ.శకుంతలా బాయి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గ్రంథాలయంలో ఆదివారం విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ.. వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్, డ్రాయింగ్ నేర్పించడం జరుగుతుందన్నారు. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ శిబిరం కొనసాగుతుందన్నారు.

తనకల్లు: గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి మస్తాన్‌వలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



ఉగ్గిరెడ్డిపల్లిలో సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఓడీ చెరువు: మండలంలోని ఉగ్గిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఆదివారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో పురోహితులు పంచరత్న సరేష్‌శర్మ, మాడుగుల సత్యనారాయణ వరప్రసాద్, తోయరాజ్ స్వామి బృందం తొలుత ప్రత్యేక పూజలు చేపట్టారు. శుక్ర, శనివారాల్లో సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలను నవధాన్యాలు, కలశ పూజలు, విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఆదివారం కొబ్బరి, అరటి, మామిడి ఆకుల తోరణాలతో పచ్చని పందిరితో కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేశారు.

రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలంకరణ మధ్య సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించారు. పుష్పమాలధారణతో శాస్త్రోక్తంగా కన్యాదానం, కంకణాలు, మంగళసూత్రాలు, సమర్పించి కల్యాణం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఆర్‌ఐ నాగేంద్ర, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'పది' టాపర్‌కు అభినందన



విద్యార్థిని అతీఫాకు స్వీట్ తినిపిస్తున్న కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి



అతీఫాను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్

కదిరి అర్బన్: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 586 మార్కులు సాధించి పట్టణ టాపర్‌గా నిలిచిన స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని అతీఫాను ఆదివారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్‌లు వేర్వేరుగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించిన అతీఫాకు ఒక్కొక్కరూ రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. అనంతరం విద్యార్థిని మాట్లాడుతూ.. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి, కంప్యూటర్ ఇంజినీర్ కావాలన్నదే లక్ష్యమని తెలిపింది. అతీఫా ప్రణాళిక ప్రకారం చదవడంతో ఉత్తమ మార్కులు సాధించిందని తండ్రి అక్రమ్ సంతోషం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పెనుకొండ రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు, ఆటో ఢీ కొన్న సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెనుకొండ పట్టణ పరిధిలోని తిమ్మాపురం దాల్ మిల్ వద్ద ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. తిమ్మాపురం ఎస్సీ కాలనీకి చెందిన శ్రీరాములు తన ద్విచక్ర వాహనంలో పెనుకొండ నుంచి తిమ్మాపురం వెళ్తున్నారు. అలాగే గుట్టూరు వైపు నుంచి పెనుకొండ వైపు ద్విచక్ర వాహనంలో వన్నూరు వలీ, అయేషా వెళ్తున్నారు. అయితే తిమ్మాపురం దాల్ మిల్ వద్ద రెండు వాహనాలు పరస్పరం ఢీ కొన్నాయి. పెనుకొండ వైపు నుంచి ఐదుగురితో వెళ్తున్న ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న నుయ్యిలో పడటంతో డ్రైవర్ రవికుమార్ గాయపడ్డారు. క్షతగాత్రులు రవికుమార్, శ్రీరాములు, అయేషా, వన్నూరువలిని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు రవికుమార్, వన్నూర్‌వలిని అనంతపురం తీసుకెళ్లారు.

మైక్రో వాటర్‌షెడ్ కమిటీల ఎంపిక



ఆనంద్‌కుమార్



రూప



సుజాత



శివరామప్ప



తిమ్మయ్య



మౌనిక

పుట్టపర్తి అర్బన్: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆదేశాలతో గ్రామాల్లో వాటర్‌షెడ్ల బలోపేతానికి పుట్టపర్తి మండలంలో వాటర్‌షెడ్ కమిటీలను ఆదివారం ఎంపిక చేశారు. మండలంలోని వెంగళమ్మ చెరువు, చెర్లోపల్లి, అమగొండపాళ్యం గ్రామాల్లో మైక్రో వాటర్‌షెడ్ కమిటీలు ఏర్పాటు చేశారు. ఇందులో ఒక్కో కమిటీకి చైర్‌పర్సన్, కో–చైర్‌పర్సన్, 9 మంది కమిటీ మెంబర్లు ఉంటారు. పదవులు పొందిన వారు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వెంగళమ్మ చెరువు..

వెంగళమ్మ చెరువు వాటర్ షెడ్ కమిటీ చైర్మన్‌గా జి.ఆనంద్‌కుమార్, కో–చైర్‌పర్సన్‌గా రూపను ఎంపిక చేశారు. సభ్యులుగా లక్ష్మీదేవి, కవిత, సాలెమ్మ, కేశప్ప, సుశీల, మనోహర్, నాగేంద్ర, ప్రభాకర్, భాస్కర్‌ను నియమించారు.

చెర్లోపల్లి..

చెర్లోపల్లి వాటర్‌షెడ్ కమిటీ చైర్‌పర్సన్‌గా పి.సుజాత, కో–చైర్‌పర్సన్‌గా కంబాలపర్తి శివరామప్పను ఎంపిక చేశారు. సభ్యులుగా రమణమ్మ, ఆదిలక్ష్మి, రేణుకబాయి, గంగిరెడ్డి, సాయిలీల, పీవీఆర్ నాయుడు, సుజాత, జి.చంద్రశేఖర్, ఎం.చంద్రశేఖర్‌ను నియమించారు.

అమగొండపాళ్యం..

అమగొండపాళ్యం వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్‌గా అమగొండపాళ్యం తిమ్మయ్య, కో–చైర్ పర్సన్‌గా బొంతలపల్లి మౌనిక, సభ్యులుగా సుధాకర్, గంగాధర్, కేశమ్మ, చెన్నకేశవులు, వెంకటేష్, శైలజ, వసుంధర, లక్ష్మీనరసమ్మను నియమించారు.

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

నల్లమాడ: ఇంటర్‌లో ప్రవేశాలకు ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్డీటీ సెట్‌కు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏటీఎల్ సుదర్శన్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టేట్ సిలబస్‌కు 500 మార్కులపైనా, సీబీఎస్ఈకి 420 మార్కులు పైగా సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్డీటీ స్పాన్సర్‌షిప్ కలిగిన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో చదివినా కూడా అర్హులేనని వెల్లడించారు. ఈనెల 9వ తేదీ నుంచి స్థానిక ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. నెట్‌లో డౌన్‌లోడ్ చేసిన పదో తరగతి మార్కుల కాపీ, హాల్‌టికెట్, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు, తల్లి లేదా తండ్రితో కలిసి చేయించుకున్న బ్యాంక్ ఖాతా పుస్తకం, స్టడీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌ఫొటోతో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

72.2 మి.మీ వర్షపాతం నమోదు

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. తాడిమర్రి, కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి, బూడుదులకుంట, మరువపల్లి, నిడిగల్లు, మద్దులచెరువు తదితర గ్రామాల్లో రాత్రి 2 గంటల నుంచి 3 గంటల మధ్యలో గాలులతో కూడిన వర్షం కురిసింది. 72.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ సౌమ్య ఆదివారం తెలిపారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి సచివాలయం–1, 2 పరిధిలో సోమవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ శాంతాబాయి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల సభ్యులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొత్తచెరువు: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ లింగన్న తెలిపారు. ఆదివారం నాగుల కనుమ వద్ద అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న ఎనుములపల్లి గ్రామానికి చెందిన మధుసూదన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా.. మధుసూదన్ ఇసుకను కొత్తచెరువుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

ధర్మవరం రోడ్డు తహసీల్దార్ కార్యాలయం సమీపంలో శ్రీనివాసులు అనే వ్యక్తి మద్యం అక్రమంగా తీసుకెళ్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ లింగన్న తెలిపారు. బుక్కపట్నం మండలం లింగప్ప గారిపల్లికి చెందిన శ్రీనివాసులు నుంచి ఆంధ్ర మద్యం (30 క్వార్టర్లు) స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ లింగన్న చెప్పారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య



సురేష్ మృతదేహం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు కొప్పల సురేష్ అప్పుల బాధతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చేనేత కార్మికుడు దాసు కుమారుడు కొప్పల సురేష్ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కాగా.. సురేష్ దాదాపు రూ.3 లక్షల దాకా అప్పులు చేసినట్లు బంధువులు చెబుతున్నారు.

పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ధర్మవరం అర్బన్: కంటి చూపు తగ్గిన నిరుపేదలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి వారికి చూపును ప్రసాదిస్తున్నామని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన శ్రీచక్ర ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరం 1991–92 సంవత్సరం కొత్తపేట రైల్వే స్కూల్ పూర్వ విద్యార్థులు దాతలుగా వ్యవహరించారు. ఈ శిబిరంలో కంటిచూపు తగ్గిన 80 మందికి కంటి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. 40 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ప్రతి నెలా పేదల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ కార్యదర్శి సుంకు సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, క్యాంప్ చైర్మన్ శీలా నాగేంద్ర, సభ్యులు పోలా ప్రభాకర్, జయరాం, రమేష్‌బాబు, నామాల శ్రీనివాసులు, బండి నాగేంద్ర, పూర్వ విద్యార్థులు రంగం బాలాంజనేయులు, లక్ష్మీనారాయణ, రంగం శ్రీనివాసులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఓడీ చెరువు: మండలంలోని టీ.కుంట్లపల్లికి చెందిన రఫీ భార్య అమ్మాజాన్ కడుపు నొప్పి తాళలేక ఆదివారం ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. అమ్మాజాన్ తరచూ కడుపు నొప్పితో బాధపడుతోంది. సాయంత్రం కడుపు నొప్పి భరించలేక ఇంట్లోని పురుగుల మందు సేవించింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.